క్లుప్తంగా

డీఎస్పీగా శ్రీహరిరాజు బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం: పెద్దాపురం డీఎస్పీగా శ్రీహరిరాజు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకూ ఇక్కడ డీఎస్పీగా పని చేసిన కె.లతాకుమారి విజయవాడకు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు రావడంతో ఆమె స్థానంలో రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీగా పని చేస్తున్న శ్రీహరిరాజును ఇక్కడ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. తొలుత సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు మర్యాద పూర్వకంగా ఆయనను కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

30 వరకూ రైల్వేగేటు మూసివేత

సామర్లకోట: రైల్వే ట్రాకు మరమ్మతుల దృష్ట్యా ఉండూరు రైల్వే గేటును సోమవారం నుంచి 30వ తేదీ వరకూ మూసి వేస్తామని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామసుబ్బారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే గేటు మూసి వేసిన కారణంగా సామర్లకోట నుంచి ఉండూరు, అచ్చంపేట వెళ్లే వాహనాలు అచ్చంపేట ఏడీబీ రోడ్డు మీదుగా మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సామర్లకోట పోలీసులకు, మున్సిపల్ కమిషనర్‌కు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చామని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

రేపు క్రీడా పోటీలు

సామర్లకోట: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వాహక కమిటీ ఇన్‌చార్జులు ఎం.వెంకటేశ్వరరావు, యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. 24న నియోజకవర్గ బాలుర పోటీలు, 25న బాలికల పోటీలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు.

సేవలు అభినందనీయం



గుడివాడలో యర్రంశెట్టి పోలీస్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

పెద్దాపురం: మండలంలోని గుడివాడ గ్రామంలో ఏ దేవాలయంలో పూజలు నిర్వహించినా యర్రంశెట్టి పోలీస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు పోలీస్‌ను పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆలయ కమిటీ కోరింది. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నేడు మర్లావలో అన్న సమారాధన

మర్లావ గ్రామంలో సోమవారం అన్న సమారాధన నిర్వహించనున్నట్లు పెద్దాపురం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మిరియాల రాజా తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు.

జోరుగా అన్నదాన కార్యక్రమాలు



సామర్లకోట వీర్రాఘవపురంలో అన్నదానం చేస్తున్న సభ్యులు

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ఆదివారం అన్నదానాలు జరిగాయి. స్థానిక వీర్రాఘవపురంలో జరిగిన అన్నదానంలో వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు, నిమ్మకాయల రంగనాగ్, పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, నిమ్మకాయల కిరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న జయ లక్ష్మీ థియేటర్ రోడ్డులో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పవర గ్రామంలో ఏర్పాటైన అన్నదానంలో ఆ గ్రామ సర్పంచ్ నాగనబోయిన సీతామహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వీరంరెడ్డి ఆనంద్, నాగనబోయిన రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కవోని నిర్లక్ష్యం

- పట్టించుకోని అధికారులు
- బీటలు వారేలా బ్రిడ్జిలు



పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువ వంతెనపై ఇలా..



సామర్లకోట- అచ్చంపేట రోడ్డులో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పెరుగుతున్న మొక్కలు



సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడల్లో మొక్కలు

సామర్లకోట: మొక్కవోని నిర్లక్ష్యం అలముకుంది.. అంతకంతకూ పెరుగుతోంది. అనేక ప్రభుత్వ కార్యాలయాలు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, వంతెనలు, కల్వర్టులపై మొక్కలు పెరుగుతున్నా అధికారులు తమకెందుకులే అన్నట్లు వదిలేస్తున్నారు. దీంతో చిన్న మొక్కలు వృక్షాలుగా మారి భవనాలు, వంతెనలను కూల్చి వేసే ప్రమాదం ఉంది. సామర్లకోట నుంచి అచ్చంపేట వెళ్లే రోడ్డులో రైల్వే ట్రాక్ మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి స్తంభాల మధ్యలో మొక్కలు పెరిగిపోతున్నాయి. ఈ బ్రిడ్జి మీదుగా రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు కాకినాడ పోర్టుకు వెళ్లే 60 నుంచి 80 టన్నుల బరువు కలిగిన గ్రానైట్ రాళ్ల వాహనాలు తరచూ వెళుతుంటాయి. దీంతో మొక్కలు చెట్లుగా మారితే బ్రిడ్జి స్తంభాలు బీటలు వారి బ్రిడ్జి మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. అదే విధంగా పిఠాపురం రోడ్డులో ఉప్పువారి సత్రం వద్ద ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన స్తంభాలపై కూడా మొక్కలు పెరుగుతున్నాయి. సుమారు 10 రోజుల నుంచి ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీనికితోడు ఈ రోడ్డులో భారీ వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంది. స్థానికంగా పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ఉన్న పరిశ్రమలకు ముడి సరకు విశాఖపట్నం నుంచి ఈ రోడ్డు మీదుగానే వస్తుంది. అదే విధంగా పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడల్లో మొక్కలు పెరుగుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదు. మొక్కలు చెట్లుగా మారితే గోడలను బలహీన పరిచే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిలపై పెరుగుతున్న మొక్కలను తొలగించి అవి తిరిగి పెరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అటుగా అధికారులు వెళ్తున్నా..

నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ బ్రిడ్జిల మీదుగా రాకపోకలు చేస్తూంటారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి కాకినాడ, ద్వారపూడి, పెద్దాపురం ఏడీబీ రోడ్లను కలుపుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి గోడల్లో రాయి మొక్కలతో పాటు అనేక రకాల మొక్కలు పెరిగాయి. అవి వృక్షాలుగా మారితే బ్రిడ్జి బీటలు వారే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, వంతెనలు వేర్వేరు ప్రాంతాలకు చెందిన అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయి. అచ్చంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి కాకినాడ ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో, ఏలేరు కాలువపై వంతెన పిఠాపురం ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో, సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి పెద్దాపురం ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయి. ఇప్పటికైనా వారు స్పందించాల్సి ఉంది.

తిరిగి వస్తున్నాయి..



ఫ్లైఓవర్ బ్రిడ్జి, వంతెనలపై పెరుగుతున్న మొక్కలు తొలగించడానికి ఎక్కువ ఖర్చు అవ్వదు. ఆర్‌అండ్‌బీ శాఖలో ఉండే కార్మికుల ద్వారా వీటిని తొలగించవచ్చు. అయినా ఆ శాఖ పట్టించుకోవడం లేదు. ఆయా ప్రదేశాల్లో మొక్కలను వెంటనే తొలగించాలి. ఇందులో ఎక్కువగా రావి మొక్కలు ఉంటున్నాయి. కొన్ని సమయాల్లో మొక్కబడిగా మొక్కలను నరికి వేస్తున్నారు. వేర్లు ఉండటం వల్ల తిరిగి వస్తున్నాయి.

–ఆవాల లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు, సామర్లకోట

అధికారులకు లేఖ రాస్తాం..



ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, వంతెనలను రక్షించాల్సిన బాధ్యత ఆర్‌అండ్‌బీ అధికారులపై ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, పిఠాపురం రోడ్డులోని వంతెనకు సంబంధించి కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం ఆర్‌అండ్‌బీ డీఈలకు లేఖలు రాసి మొక్కలు తొలగించి, అవి తిరిగి పెరగకుండా చర్యలు తీసుకుంటాం.

–గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్, సామర్లకోట

3 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు



శరన్నవరాత్ర ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించిన సేవా సమితి ప్రతినిధులు

సామర్లకోట: మండలంలోని పీబీ దేవం గ్రామంలో శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వచ్చే నెల మూడో తేదీ నుంచి 12వ తేదీ వరకూ శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సేవా సమితి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. 29న పందిరి రాట వేయడానికి ముహూర్తం నిర్ణయించారు. 3వ తేదీ ఉదయం కలశస్థాపన, 8న విద్యార్థులచే సామూహిక సరస్వతి పూజ, 19న మహిళలచే అష్టలక్ష్మీ పూజ, 12న విజయదశమి సందర్భంగా పూర్ణాహుతి, అనంతరం అన్నదానం జరుగుతుందని గంగాధర్ వివరించారు. ప్రతిరోజూ ఉదయం ఏకవార రుద్రాభిషేకాలు, రాత్రి లలితా సహస్ర నామాలతో కుంకుమ పూజలు, నీరాజన మంత్ర పుష్పం, భజనలు జరుగుతాయన్నారు. సమావేశంలో సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు నవ్వుల వెంకట్రాజు, టీవీవీ సత్యనారాయణ మూర్తి, సూర్యచంద్రరావు, టి.సాంబశివరావు, తోటకూర రాంబాబు, మావుల మాచారావు, ఆచంట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ అడుగుజాడల్లో నడవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మట్టే ఆదిశంకర్

పెద్దాపురం: గురజాడ అప్పారావు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, లలితా రైస్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ మట్టే ఆదిశంకర్ అన్నారు. గురజాడ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో దేశభక్తి చిత్రలేఖన పోటీల విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఆదిశంకర్ మాట్లాడారు. మహనీయుల జీవిత విశేషాలను తెలుసుకునేందుకు విద్యార్థులకు ఇటువంటి దేశభక్తి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. విశ్రాంత అధ్యాపకురాలు సంధ్యారాణి, యూటీఎఫ్ నాయకులు మూర్తి, పీఎస్ఎం కార్యదర్శి రొంగల వీర్రాజు, డి.కృష్ణ, సీఐటీయూ అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, పీసీసీ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, నవీన్‌నానీ, మణికంఠ, లలిత తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థిని



నృత్య పోటీలకు హాజరైన విద్యార్థులు

శాస్త్రీయ, నృత్య సంగీత పరీక్షలు

సామర్లకోట: చండీఘర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ పర్యవేక్షణలో ఆదివారం సామర్లకోటలో కూచిపూడి నృత్యం, శాస్త్రీయ సంగీత పరీక్షలు నిర్వహించారు. సెంట్రల్ హెడ్ బేతా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పోటీ పరీక్షలకు సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ, అన్నవరం, రాజమహేంద్రవరం ప్రాంతాలకు చెందిన 46 మంది విద్యార్థులు హాజరయ్యారు. నృత్యం, సంగీతం జూనియర్ విభాగంలో సర్టిఫికెట్ కోర్సులకు, సీనియర్ విభాగాల్లో డిప్లమో కోర్సులకు పరీక్షలు నిర్వహించినట్లు సత్యనారాయణ తెలిపారు. కర్ణాటక సంగీతానికి హైదరాబాద్‌కు చెందిన మధుసూదనరావు, కూచిపూడి నృత్యానికి హైదరాబాద్‌కు చెందిన దీప్తి సరోజినిలు ఎగ్జామినర్లుగా ఉన్నారు.

హామీలను ప్రభుత్వం అమలు చేయాలి



కార్మిక మహాసభలో మాట్లాడుతున్న దుర్వా శేషబాబ్జీ

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్వా శేషబాబ్జీ డిమాండ్ చేశారు. సామర్లకోట సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్మిక శాఖ మహాసభలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. తల్లికి వందం, ఉచిత గ్యాస్ సిలిండర్, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేయాలన్నారు. ఏలేరు ఆధునీకరణ చేసి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వర్షాలు వచ్చిన ప్రతి సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కార్మిక శాఖ కార్యదర్శిగా విప్పర్తి కొండలరావును ఎన్నుకున్నారు. ఈ మేరకు కొండలరావు మాట్లాడుతూ పిఠాపురం, కాకినాడ, రాజానగరం రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇసుక కొరత కారణంగా కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆరోపించారు. కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలన్నారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు, ఆ పార్టీ నాయకులు బాలం శ్రీనివాసు, నవర సురేష్‌కుమార్, బాలం సత్తిబాబు, చల్లా మహేష్, బాలం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని వస్తువులతో ఆట పరికరాలు



పనికి రాని వస్తువులతో అందమైన వస్తువులు తయారు చేసిన విద్యార్థులతో రైల్వే అధికారులు

సామర్లకోట: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పనికిరాని వస్తువులతో ఆట వస్తువులు తయారు చేసే పోటీలను ఏర్పాటు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. ఈ మేరకు రైల్వేలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల పిల్లలకు ఆదివారం పోటీలు నిర్వహించామన్నారు. పని చేయని కాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, క్లాత్‌లతో ఫ్లవర్ వాజ్లు, పెన్నుల స్టాండ్, డోర్ మేట్‌లను సుందరంగా తయారు చేశారు. ఇందులో విజేతలకు బహుమతులను రమేష్ అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్ఎస్ బి.శ్రీధర్, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సస్య రక్షణ.. నష్ట నివారణ

- భారీ వర్షాలు, వరదలకు నీట మునిగిన ఉద్యాన పంటలు
- సస్య రక్షణ చర్యలు చేపట్టిన అన్నదాతలు
- 100 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు



పెద్దాపురం మండలంలో నేలకొరిగిన అరటి తోటను పరిశీలిస్తున్న హెచ్ఓ

పెద్దాపురం: వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మెట్ట రైతాంగం కుదేలైంది. ఉద్యానశాఖ పెద్దాపురం సబ్ డివిజన్‌లోని వందల ఎకరాల్లో దుంప, అరటి, కూరగాయలు, పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెద్దాపురం ఉద్యానశాఖ సబ్ డివిజన్ పరిధిలోని సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో సుమారు వంద ఎకరాల్లో దుంప, మామిడి, జీడి మామిడి, జామ, అరటి, బొప్పాయి, ఆయిల్‌పామ్ తదితర పంటల ఉద్యాన పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ముంపునకు గురైన దుంప, అరటి తోటల్లో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక దుంప పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జానకి, ఉద్యానశాఖాధికారి సుజాత సూచనల మేరకు మెట్ట రైతాంగం పంట సంరక్షణా చర్యల్లో నిమగ్నమయ్యారు.

పొలాల్లో నీటిని తీసివేయాలి

నీట మునిగిన ఉద్యాన పంటల సంరక్షణకు అధికారులు పలు సూచనలిస్తున్నారు. వాటిలో కొన్ని సూచనలు ఇలా...కూరగాయలు, ఉద్యాన పంటల్లో నిలిచిపోయిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అంతర సేద్యం చేపట్టి కలుపు తీయడమే కాకుండా నేలతడారేలా చూసుకోవాలి. డీఏపీ, యూరియా వంటి పోషకాలు పంటకు వేయాలి. పొలంలో నీరు నిల్వ ఉండడం వల్ల ఎండు తెగులు సోకే ప్రమాదం ఉంది. ఆకుమచ్చ తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన శాఖాధికారులు సూచించారు. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైఫైడ్ మూడు గ్రాములు లేదా మెటాలాక్సిల్ మోంటోజెట్ రెండు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి మొక్కల మొదల్లో పిచికారీ చేయాలన్నారు. రాత్రి ఉష్ణోగ్రత తగ్గడం వల్ల ఆకుమచ్చ, బూజు తెగులు ఆశించే అవకాశం ఉందని, ఆకుమచ్చ నివారణకు కార్బెండిజం ఒక గ్రాము లేదా మాంకోజెడ్ రెండు గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బూజు తెగులు నివారణకు డైమిథోమస్ 1.5 మిల్లీ గ్రాములు లేదా మెటాలాక్సిల్ మాంకోజెట్ రెండు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచిచారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు



ఉద్యాన పంటల సాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. సస్య రక్షణ చర్యలు, విధానాలపై ఉద్యానశాఖ, వీఏఏలను సంప్రదించాలి. అధికారుల సూచనలు పాటించడం ద్వారా ఉద్యాన పంటలను కాపాడుకోవచ్చు. పండ్లు, పూలతోటలు సాగు చేసిన రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చు.

–ఎస్.సుజాత, ఉద్యాన శాఖాధికారి, పెద్దాపురం

పచ్చని ఆలోచన..



చెందుర్తిలో కోళ్ల ఫారం షెడ్డుపై పచ్చని పాదు

పిఠాపురం: ఒకపక్క ఎడతెరపి లేని వర్షాలు.. వెంటనే మండుతున్న ఎండలు.. వీటిని తట్టుకోలేక కోళ్ల ఫారాలు విలవిలలాడుతున్నాయి. వర్షం పడితే తేమ పెరిగి, ఎండ కాస్తే వేడి పెరిగి కోళ్లు చనిపోతుండగా వాటి రక్షణకు మోటారుతో నీరు ఉపయోగించడం వల్ల ఆర్థిక భారం అవుతోంది. వాటి నుంచి రక్షించుకోవడానికి ఒక రైతు వినూత్నంగా చేసిన ఆలోచన కోళ్ల ఫారాలకు రక్షణగా నిలుస్తోంది. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఒక రైతు తన కోళ్ల ఫారాల రేకుల షెడ్డుపైకి పచ్చని పూల పాదును ఎక్కించాడు. దీంతో వర్షాలు పడినా, ఎండలు కాసినా ఉష్ణోగ్రతల్లో సమతుల్యత ఉండి కోళ్లఫారానికి రక్షణగా మారింది పచ్చని పాదు.

కూతురే ఇంటికి మహాలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా బాలల సంక్షేమాధికారి వెంకట్రావు

కాకినాడ రూరల్: కూతురే ఇంటికి మహాలక్ష్మి అని, వారి పట్ల ప్రేమానురాగాలు చూపాలని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. జాతీయ కుమార్తెల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆడపిల్లలను భారంగా చూస్తుండగా, ఇతర దేశాల్లో సంబరాలు చేసుకుంటున్నారన్నారు. మన దేశంలో ఒకప్పుడు ఆడపిల్ల అంటే ఎంతో భారంగా పరిగణించేవారని, నేడు వారిని మహాలక్ష్మిగా గౌరవిస్తున్నారన్నారు. వాస్తవంగా మగపిల్లలు కంటే ఆడపిల్లలే కుటుంబం పట్ల ప్రేమానురాగాలు చూపుతారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

విజన్ ప్లాన్‌లో భాగస్వాములు కండి

కాకినాడ సిటీ: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 2047 నాటికి వందేళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వికసిత్ భారత్‌లో భాగంగా ప్రభుత్వం స్వర్ణాంధ్రా 2047 విజన్‌కు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ఆర్థిక, సామాజికాభివృద్ధి, పర్యావరణ, సుస్థిరతలపై దృష్టి సారిస్తూ ప్రధాన వృద్ధి కేంద్రంగా మార్చడానికి కావాల్సిన కార్యాచరణ ప్రణాళిక నిర్దేశించిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ రూపకల్పనలో భాగస్వామ్యం కావాలని జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు కోరుతుందన్నారు. ఈ విజన్ సభల్లో పాల్గొని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నమోదు చేయాలన్నారు.

సామాజిక సేవలతో సంతృప్తి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న బాదం బాలకృష్ణ

బోట్‌క్లబ్: లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ ప్రారంభించి వ్యాపార అభివృద్ధితో పాటు, వచ్చిన లాభంలో సామాజిక సేవలు చేయడం సంతృప్తిని ఇస్తుందని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక జగన్నాథపురంలో లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. యువత లోకల్ బిజినెస్ నెట్‌వర్క్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజ సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. నెట్‌వర్క్ అధ్యక్షులు అంకుర్ సురాన మాట్లాడుతూ ఈ రక్తదాన శిబిరంలో వంద బ్లడ్ ప్లాకెట్లను అందించనున్నట్లు చెప్పారు. సభ్యుల సహకారంతో మరిన్ని సేవలు చేపడతామన్నారు. నెట్‌వర్క్ సెక్రటరీ సతీష్ కుమార్, ట్రెజరర్ సిరాజ్, ఉపాధ్యక్షుడు పి.రవితేజ, రోటరీక్లబ్ ఎలెక్టెడ్ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి, రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు పాల్గొన్నారు.